# మోసపోయిన మొనగాడు

ఎం. యస్. చెన్నూరి

గంట గంటన్నరనించి యెదురు తెన్నులు కాస్తూ, ప్లాట్‌ఫారం మీద పడిగాపులు పడుతోన్న ప్రయాణీకులు, అల్లంత దూరాన-రైలుపట్టాలమీద రణగొణధ్వని చేసుకుంటూ, పొగలుకక్కుతూ భూతానికిమల్లే పరుగిడుతోన్న ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ కనిపించేసరికి, కంగారుగా, మూటాముల్లే సర్దుకుని పిలపిలా లేచారు. క్షణంలో రైలు స్టేషన్ చేరుకోవడం, ప్లాట్‌ఫారం ప్రయాణీకులతో కిటకిట లాడిపోవడం జరిగిపోయింది.

చోటు కోసం, పెట్టే బేడా కూలీల నెత్తికెక్కించి, అడ్డు తగిలే వాళ్ళని తప్పించుకుంటూ, పెట్టె పెట్టెకీ గంతులేసేవాళ్లూ - పెట్టే బేడా నెత్తి నెట్టుకునే, అడ్డు తగిలే వాళ్ళని తొక్కిపెట్టున క్రింద పడదోస్తూ, తమ మనుషుల్ని కేకలేసుకుంటూ, ఆ చివరినించి యీ చివరికి కంగారుగా పరుగులు తీసే వాళ్లూ - ప్లాట్‌ఫారంమీద నానా హంగామా పడుతోంటే, రైలు పెట్టెల్లో సుఖాసీనులయిన ప్రయాణీకులు తమాషా చూస్తూ, గేటు దగ్గర కాపలాపెట్టి, యెవర్నీ తమ పెట్టెలో కాలుబెట్టనీకండా శ్రద్ధ తీసుకుంటున్నారు. మరి కొందరు ప్రబుద్ధులు, కాస్త బుర్ర వుపయోగించి, తలుపులు తెరవడానికి వీలు కాకండా పెట్టేబేడా తలుపుల వెనకాల సర్ది, బిఛాణాలు పరుచుకొంటున్నారు.

ప్లాట్‌ఫారంమీది ప్రయాణీకులు, విసిగి వేసారి, రెచ్చిపోయి, పంచెలు ఎగ్గట్టి, దట్టీలు బిగించి, పెట్టే బేడా కిటికీల్లోంచి లోపలికి గిరాటేసి, తామూ అమాంతం యెగిరి యెవడి నెత్తినో గంతేసి, మల్లయుద్ధానికి సిద్ధమవుతున్నారు.

ఇహ, నాబోటి 'దద్దమ్మగాళ్లు' సాహసించలేక గుడ్లప్పజెప్పి చూస్తూ నుంచోడంకంటే యేమీ చెయ్యలేని స్థితిలో వున్నారు.

గార్డు విజిలూ - ఇంజన్ కూతా - వొకదాని వెంబడొకటి వినిపించినయ్. రైలు కదలడానికి కొన్ని క్షణాలకంటే ఆట్టే వ్యవధి లేదు. నాకీ బండ్లో ప్రయాణంచేసే యోగం లేదన్న విషయం దృఢం చేసుకుని, నిస్పృహతో అలా చూస్తూ నుంచుండిపోయాను.

నా కెదురుపెట్టెలోని పెద్దమనిషి యింతసేపూ నన్ను గమనిస్తూ వున్నాడల్లే వుంది. నా నిస్సహాయతకి జాలిపడి, నావేపు అదోలా చూచి, తలుపు కొద్దిగా తెరిచి, మరో ప్రాణి కంటబడకుండా లోపలికి రమ్మన్నట్టు తల వూపాడు. ప్రవాహంలో కొట్టుకుపోయే దౌర్భాగ్యుడికి గడ్డిపోచ వూత దొరికినట్టయింది. అతగాడికి కృతజ్ఞత తెలిపి, శరీరాన్ని లోపలికి చేరవేశాను.

"అలా నిరుత్సాహ పడిపోతే యెలా బాబూ! ఎంత కష్టమయిన పనయినా సరే ప్రయత్నించడం మానవధర్మం. జయాపజయాలు మన చేతుల్లో లేవనుకో—"

"నిజమే. కాని, యేం విటౌట్ సర్కసు ఫీట్లు?"

"ప్రజల్లో సభ్యత లేనప్పుడు యేం చేస్తాం? - మర్యాదస్తులికి కాలం గాదు" బరువుగా నిట్టూర్పు విడిచాడు.

"కూచో బాబూ! - కూచో..." తను పరుచుకున్న పక్కచుట్టని కాస్త మడిచి చోటు చేశాడు. బ్రతుకుజీవుడా అని చతికిలబడ్డాను బల్లమీద.

"ఏ వూరెళ్లాలి బాబూ?"

"మద్రాసండి."

"వ్యాపారమా?"

"మరేనండి."

"నేనూ మద్రాసే. కోర్టుపని మీద వెళుతున్నా. రెండు మూడు రోజుల్లో పని పూర్తవొచ్చు."



దొంగవేషాలు

ఫోటో : ఎం. ఫణిభూషణరావు (విజయవాడ)

# మోసపోయిన మొనగాడు

"అలాగా?"

*          *          *

ఎక్స్‌ప్రెస్ స్పీడుపోసుకుని, 'కీ' పెడుతూ, బాణాసికి మళ్లే దూసుకుపోతోంది.

మా సంభాషణ కూడా జోరుగానే సాగిపోతోంది. స్వవిషయాల్లోంచి రాజకీయాల్లోకి - రాజకీయాల్లోంచి సినీ జగత్తులోకీ - సినీ జగత్తులోంచి క్రాస్‌వర్డ్సు ప్రపంచంలోకీ గంతులేస్తోంది.

అతడు మాట్లాడుతోంటే ప్రపంచంలో అతనికి తెలీని విషయమంటూ లేదేమోననిపించింది. వయసులో పెద్దవాడయినా భావాల్లో నవయువకుడు. అంచేతే అంత శీఘ్రకాలంలోనే మా ఇద్దరి మధ్యా అంత సన్నిహిత మైత్రి యేర్పడగలిగింది.

బండి గూడూరు స్టేషన్ చేరుకుంది. ఇద్దరం బండిదిగి, ఇండియన్ రిఫ్రెష్‌మెంటు రూముకి నడిచాం. కాఫీ పుచ్చుకుందుకు పాంటు జేబులో చెయ్యి వేశాను కడుపులో గతుక్కుమంది. కంగారుగా జేబులు తడుముకోవడం గమనించి- "ఏం బాబూ, ఏమిటి వెతుకుతున్నారు?" అని ఆతురతగా ప్రశ్నించాడతడు. పర్సు పోయిందని చెప్పాను.

"ఏమిటి? పర్సు పోయిందా?" అని, గుడ్లు తేలవేసి నుంచుండిపోయాడు పాపం!

నాతోబాటు అతడూ కాఫీ పుచ్చుకోకుండానే కంపార్టుమెంటుకి నడిచాడు. నా బ్యాగూ, కూచున్న సీటూ; పరిసరాలూ అంతా గాలించేశాం కాని లాభం లేకపోయింది.

"ఏం బాబూ! పర్సులో యేమాత్రం వుంటుందేమిటి?" అని సానుభూతిగా వాకడుగుతోంటే యేం చెప్పాలో తెలీక తికమకపడ్డాను.

పర్సులో మహా వుంటే రెండు మూడు రూపాయలుంటుందేమో! అదృష్టవశాత్తు టిక్కెట్టు గూడా చొక్కా జేబులోనే వుంది. కాని, పర్సులో రెండో మూడో వుంటుందని యెలా చెప్పను? ఉద్యోగార్జన కోసం వెళుతున్నానని చెప్పుకోను సిగ్గుపడి వ్యాపారంమీద వెళుతున్నానని బొంకానాయె. అలాంటి

వాడివద్ద రెండో మూడో వుండడ మేవిఁటి? - పోయింది యెలాగూ రాదుకదా! రెండో మూడో అని చెప్పి, అనవసరంగా వారిదృష్టిలో నా విలువని తగ్గించుకోవడ మెందుకు?——


"ఆఁ - ఏ ముంటుందిలెండి! ఓ వందా పైచిలుకు. అంతే - అవసర మయినప్పుడు యింటికి వైరిచ్చి టి.యం.ఓ. తెప్పించుకోవడం అలవాటు. వూళ్ళు తిరిగేవాళ్ళం. మా దగ్గర పెద్ద మొత్తాలుంటే యింకేమేనా వుందా?— అదయినా యేదో చేతికర్చులిగ్గాను తెచ్చుకున్నాను" అని ఓ అబద్ధం ఆడేశాను.

"అదేవిఁటి బాబూ! వందంటే మాత్రం యీ రోజుల్లో పూరికే వొస్తుందా? అష్టకష్టాలు పడితే తప్ప పచ్చకాయితం కళ్ళకగపడనిపించడం లేదు" అని అంటూ, జేబులోంచి పర్సు తీశాడు.

"మీవాళ్ళకి టెలిగ్రాం యివ్వడానికయినా నీవద్ద డబ్బెక్కడిది? యెందుకేనా మంచిది. ఇది నీవద్ద వుంచుకో బాబూ! మరేం అనుకోకు. టి.యం.ఓ. వొస్తే నాకు పంపిద్దువు గాని" అని, ఓ పాతిక రూపాయలు నా చేతిలో పెడుతోంటే, నా కళ్లు గిర్రున తిరిగిపోయాయి.

రైలు ప్రయాణంలో తలవని తలంపుగా పరిచయమైన ఓ అపరిచిత వ్యక్తి నమ్మి నా చేతుల్లో పాతిక రూపాయలు పెడుతున్నాడంటే నా కెందుకో పుచ్చుకునేందుకు భయమేసింది.

"మరేం ఫరవాలేదు. మోమాటపడకు. కష్టాలు అందరికీ వొస్తాయి. అధైర్యపడితే యెలా? - పుచ్చుకో బాబూ. టి. యం. ఓ. రాగానే నాకు పంపుతావుగా. అడ్రసు రాసిస్తాను" అని అంటూ పాతిక రూపాయిలు నా జేబులో పడేసి, ఓ కాయితంలో తన అడ్రసు రాసి నా చేతి కిచ్చాడు.



"పెళ్లిచూపులు" అను తెలుగుప్రహసనమును ప్రదర్శించిన ఆంధ్రవిద్యార్థిబృందము శ్రీ శారదా ప్రాథమికోన్నతపాఠశాల
(మాంబళం, మద్రాసు)
(మద్రాసు పోలీసుకమీషనరు శ్రీ యస్. పార్థసారధిఅయ్యంగారు, బి.యే., యం.యల్. గారి అధ్యక్షతను 10-4-54 న జరిగిన పాఠశాల వార్షికోత్సవసందర్భములో) ముఖ్యపాత్ర "అవధానులు" మధ్యనిల్చున్న డి. యు. యస్. ప్రసాద్.

# మోసపోయిన మోసగాడు

నిజానికి, నిరుద్యోగ సమస్యతో పీక్కు-చస్తూ నిస్సహాయ స్థితిలో వున్న నన్ను, మద్రాసులో ఏదో కాళీ వుందనీ, వెంటనే బయలుదేరి రమ్మనీ, ఓ స్నేహితుడు ఉత్తరం రాయగా, రైలు చార్జీలకుగాను, నిజం చెప్పి ఓ పది రూపాయలు పరుపత్యం పుట్టించుకోలేని నాకు, ఓ అపరిచితవ్యక్తి అయాచితంగా పాతిక రూపాయలు బలవంతాన సాయం చేస్తున్నాడంటే, ఇదంతా 'అసత్యం' మహిమేనని తేలిగ్గా అర్థమైపోయింది.

న్యాయంతో సాధించలేనివి మోసంతో యెంత సులభంగా సాధించగలమో బోధపడింది.

బండి సెంట్రల్ చేరుకోవడం, పరస్పరం సెలవు పుచ్చుకుని, విడిపోవడం జరిగింది. ఇంతలో నా కోసం స్టేషన్‌దాకా వొచ్చిన స్నేహితుడు యెదురయ్యాడు. ఇద్దరం యింటిదారిపట్టాం. దార్లో జరిగిందంతా పూసగుచ్చినట్టు వాడితో చెప్పాను.

"అదేంవిట్రా? అలా కక్కూర్తి పడిపోయావ్? యెవరో అపరిచిత వ్యక్తి ఇస్తే తీసుకోవడమే ఆ డబ్బు వెంటనే పంపించేసెయ్. నీ కావలిస్తే నన్నడగడానికి నామోషేవిఁటి?" అని చీవాట్లు పెట్టాడు.

ఎలాగూ వారు యిల్లు చేరడానికి, రెండు మూడు రోజులవుతుంది. అలాగే సోమవారం యం. ఓ. చేస్తాలెమ్మని వాడికి నచ్చజెప్పాను. ఆ డబ్బు అతగాడికి యం. ఓ. చేసేవరకూ నాకు నిద్ర పట్టలేదు.

ఆరోజు ఆఫీసునించి యింటికి రాగానే నాపేర యెక్కణ్ణించో, ఓ వుత్తరం వొచ్చిందని మావాడు వుత్తరం చేతబెట్టాడు.

ఉత్తరం ఆమూలాగ్రం చదివిం తరువాత దాన్ని రాసింది ట్రెయిన్‌లో కనిపించి, సాయం చేసిన పెద్దమనిషేనని అర్థమయింది.

ఆ వుత్తరంలో యిలా వుంది:

"డియర్ ప్రసాద్,

నా జీవితంలో యెంతమందినో మోసంచేశాను. ఎందరి పర్సులో కొట్టేశాను. కాని యెన్నడూ ఇలా మోసపోలేదు. నా జీవితంలో ఇదే మొదటిసారి—బహుశా, ఆఖరి సారికూడాను. నీవు వ్యాపారరీత్యా మద్రాసు వెళుతున్నానంటే నిజమేనని నమ్మాను. తప్పకుండా నీ పర్సులో పెద్ద మొత్తమే ఉంటుందనుకొన్నాను. నిన్ను మాటల్లో దింపి నీకు తెలీకండా, నీ పర్సు కాస్తా కొట్టేశాను.

పర్సులో వందరూపాయలుందని నీవంటే నిజమేనని నమ్మాను. నీకు సాయంచేస్తున్నట్టు నటిస్తూ పాతిక రూపాయలు నీచేత బెట్టాను.

తీరా, నిన్ను వొదలించుకుని, పర్సు తీసి చూచుకునేవరకూ నీవు చేసిన మోసం గుర్తించలేకపోయాను.

నీ స్నేహితుడు, నీకు రాసిన వుత్తరం, నీ పర్సులో చూచింతరువాత మనసు స్థిమితపడింది. ఓ నిరుద్యోగికి, ఓ పది రోజులపాటు దిగుల్లేకండా గడిచిపోయేలా సాయపడ్డందుకు నాకు సంతోషంగానే వుంది

గొప్పవాళ్ళ పర్సులు కొట్టేయడమన్నా - పేదలికి సాయపడ్డమన్నా నాకు సరదా.

మరేమీ అనుకోకు?

ఇట్లు

—"పిక్‌పాకెట్ హైదారాన్,"

పోలీసు డిపార్టుమెంటు, ఇంటలిజెంట్ శాఖలో పనిచేస్తోన్న నా మిత్రుడు, వుత్తరం పూర్తిచేసి,— "అమ్మోయ్! పిక్‌పాకెట్ హైదారావే?" - అని అదరిపడ్డాడు.

హైదారావంటే పోలీసుశాఖకే హడల్ కాబోలు!

ఉత్తరం చేరిన నాలుగయిదు రోజులికి యం. ఓ. కూడా తిరిగి వొచ్చేసింది, ఆ యడ్రసులో అలాంటి వ్యక్తి యెవరూ లేరని. ★

మేష్టారు : ఈ క్లాసులో అడ్డగాడిద ఎవడు వుంటే, వాడల్లా లేచి నిల్చోండి.

(చాలాసేపటివరకు క్లాసులో ఎవరూ లేవలేదు. కొద్దిక్షణాలు గడిచాక, సన్నగా గేడివాసంలా వున్న కుర్రాడొకడు లేచి నిలబడ్డాడు.)

మేష్టారు : ఏం? నువ్వు అడ్డగాడిదవా?

కుర్రాడు : అది కాదండీ! మీరొక్కరే నిలబడివుంటేనూ, మీకు తోడుగా అయినా వుంటుందని లేచి నిల్చున్నాను. అంతే!